# కిటికీలోంచి వాన

ఎ.వి.వి.యస్.యస్.ప్రసాద్



చిరుజల్లు కొడ్తోంది -

వానపడ్డపుడల్లా రుక్మిణక్క గుర్తొస్తుంది -

రుక్మిణక్క గుర్తొచ్చినప్పుడల్లా 'వాన' కళ్ళముందు కురుస్తున్నట్టు అన్పిస్తుంది-

వానా, రుక్మిణక్క గుర్తొచ్చినప్పుడల్లా నా చిన్నతనం గుర్తొస్తుంది-

నా చిన్నతనంలో -

అప్పుడు నేను ఫస్టుఫారమ్ జిల్లా పరిషత్తు స్కూల్లో చదువుతున్నాను. వాన గట్టిగా కురిస్తే స్కూలుకి సెలవు !

ఆ రోజు వాన పెరుగుతుందన్న అంచనాతో మా మేస్టారు బడికి సెలవు ప్రకటించారు.

చిరుజల్లులో తడుస్తూ ఇంటికి చేరాను.

అరుక్క అనుకొని వున్న కిటికీలో రుక్మిణక్క దుప్పటి కప్పుకొని కూర్చుని వానలోకి చూస్తోంది... రుక్మిణి మా పెదనాన్నగారి అమ్మాయి.

రుక్మిణక్క థర్డ్‌ఫారమ్ వరకు చదివి మానేసింది.

"ఈడొచ్చిన పిల్ల బైటకెళ్ళకూడదంతే..." అన్నారు పెద్దవాళ్ళు.

"ఇక్కడ కూర్చున్నావేంటే ?..." అన్నాను గుమ్మంలోకి అడుగు పెడ్తూ

నా మాట వినబడ్డట్టులేదు.

"ఏమే...నిన్నే !" గట్టిగా అన్నాను.

"ఏమిట్రా ?..." అంది ఉలిక్కిపడి విసుగ్గా నాకేసి చూస్తూ.

"ఏం చేస్తున్నావే ?"

"వానలోకి చూస్తున్నాను." కళ్ళని విచిత్రంగా తిప్పుతూ అంది.

"నా బొంద. చూడడాన్కి ఇంకేమి దొరకలేదా? వాన తప్పు." ఎక్కిరిస్తున్నట్టు అన్నాను.

"నీ మొహం నీకేం తెలుసురా." అంది కాస్త కోపంగా.

"ఏం తెలీదు. అందుకే మార్కులు కూడా తక్కువొచ్చాయి పరీక్షల్లో." పెద్ద తెలివిగా అన్నాను.

"ఎప్పుడు స్కూలుగోలే. వెళ్ళి ఆడుకో" కోపంగా అంది.

"బైట వానే" నవ్వుతూ అన్నా

"పెద్ద తెలివి."

"సరే కానీ రుక్కు! ఏం చూస్తూన్నావే నువ్వు వానలో. అదేదో నాకూ చూపెట్టరాదూ.?" అన్నాను సౌమ్యంగా.

"నీ మొహానికి అంత ఇది కూడానా?..." అని అన్నా. తాతయ్యతో చెప్పి రుక్కుని తిట్టిస్తానని కాబోలు.

"సరే, ఇలారా." అంది.

కిటికీ పెద్దది. దుప్పటి నా కూడా కప్పింది.

ఇద్దరం వానలోకి చూస్తున్నాము.

'కాగితం పడవలకి ఏఏ పుస్తకాల్లో పేజీలు చింపాలా?' అని ఆలోచిస్తున్నాను.

"కాగితం పడవలు చేద్దామా?..." పైకే అన్నాను, మనస్సులో అనుకుంది.

"నీ బొంద. నోర్మూసు కూర్చో."

"ఎంతసేపు చూస్తాం ఇలా. చిరాగ్గా."

"చిరాకేమిట్రా చిరాకు.... ఆకాశంనుండి భూమికి ఏదో వర్తమానం తీసుకు వస్తున్నట్టు రాలే చినుకు... బంగారు తీగలా మెరిసే మెరుపు... చిరుజల్లుగా ప్రారంభమయి, క్రమేణా పెద్దగా కుంభవృష్టిగా... క్షణంలో ఎంత మార్పు?... పెద్ద చెరువులో తామరాకుమీద చిందులువేసే చినుకు... శివాలయ శిఖరంమీదపడి చితుకుతున్న చినుకు... గాలికి వూగే ధ్వజస్తంభపు చిరు గంటలు... చిటారుకొమ్మలు, చివురు రెమ్మలు, లేత ఆకులు చినుకుస్పర్శకి పునర్జన్మ పొందుతున్నట్టు పులకించిపోతుంటే... వణుకుతూ పరవశించిపోతుంటే... తనలో పడిన చినుకులో స్వప్న ప్రపంచాల్ని ఆవిష్కరించుకొంటున్న పూవు... కొండమీది కోవెల ప్రాంగణంలోవున్న గడ్డిపూవుమీద నృత్యం చేస్తున్న చినుకు... అలలతో కదిలే చినుకు..., పచ్చని పైరుమీద కురిసే వాన... చిగురాకుచాటున వాన... చలిలో... చలికి వణుకుతూ, వానలో తడుస్తూ... సౌందర్య లోకాల అంచులకి చేరుకొంటుంటే... చుట్టూ పచ్చదనం... గడ్డిపూలు... పుప్పొడి రేణువులు... దూరంగా ఆకాశంలో విచ్చుకున్న హరివిల్లు... ఆ అనుభూతికి ఏ భాష సరిపోతుంది...?..." ఏదో చెప్పుకుంటూ పోతోంది. నాకంతా ఏదోలా వుంది.

అలా చెప్తున్నప్పుడు ఆమె కళ్ళల్లో తేజస్సు... వెలుగు... వినూత్న కాంతి... కళ్ళల్లో ముత్యాల్లా మెరుస్తూ నీళ్ళు... అందాన్ని వానచినుకులో అన్వేషిస్తోంది!

సౌందర్యాన్ని వాన చినుకులో వెతుకుతూ పరవశించిపోతున్న కమలం ఆమె —

ఎన్ని జన్మలు తపస్సు చేయాలో 'సౌందర్యోపాసన' చేయడాన్కి—?

అని యిప్పుడు అనిపిస్తోంది.

అప్పుడు ఆమె మాటలు సుద్ధ బోరు!

వానని చూసినప్పుడల్లా పరవశించిపోయేది! పులకించి పోయేది!

కొన్నాళ్ళకి—

నేను కాలేజి చదువులకి పట్నం వెళ్ళవలసి వచ్చింది. అక్కడ మామయ్యగారింట్లో ఉండేవాడ్ని... పట్నంలో ఉన్నప్పుడు రుక్మిణి పెళ్ళి అయిపోయింది. నేను పెళ్ళికి వెళ్ళలేదు పరీక్షల వలన—

చదువు పూర్తయ్యాక ఉద్యోగాన్వేషణలో మా వూరుకేసి వెళ్ళలేదు. అదీకాక, నాన్నగారు వాళ్ళు నేను పట్నం వచ్చిన కొన్నాళ్ళకి, ఉన్న భూమి అమ్మేసి పట్నం వచ్చేశారు.

ఇవాళ —

ఇన్నాళ్ళకి—

దాదాపు పుష్కరంన్నర తరువాత ఈ వూరికి వచ్చాను.

ప్రొద్దున్నే దిగాను బస్సు.

కాస్త నడుంవాల్చి లేచేసరికి వాతావరణం మసకతెరలతో కమ్మి వుంది.

తాతయ్యపోయాక ఇల్లంతా బోసిగా వుంది...!

మామయ్య వాళ్ళుంటున్నారు ప్రస్తుతం.

కొంతసేపటికి చినుకులు ప్రారంభమయ్యాయి —

చినుకును చూసేసరికి రుక్మిణక్క గుర్తొచ్చింది —

'ఇప్పుడేం చేస్తోందో...?'

ఈ వూరు ఇవతలవైపు తాతయ్యగారిల్లు... అటువైపు రుక్మిణక్క అత్తారిల్లు... బావగారు స్కూలు టీచరు. వూరు దాదాపు మర్చిపోవడంవల్ల; మరోసారి చిరునామా మామయ్యనడిగి 'వానొస్తోంది... తరువాత వెళ్ళువుగానీ అంటున్నా' వినకుండా గొడుగు తీసుకొని రుక్మిణక్క వాళ్ళింటికి బయలుదేరాను —

వానొస్తున్నప్పుడు రుక్మిణక్క ఏ చేస్తోందో? అనే కుతూహలం నాలాంటి బద్ధకస్తుడిని కూడా కదిలించింది.

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ, మధ్యలో ఒకరిద్దర్ని అడిగి, రుక్మిణక్క వాళ్ళ ఇంటికి చేరుకున్నాను—

చినుకులు పెద్దవవుతున్నాయి—

ఆశ్చర్యం!

రుక్మిణక్క కిటికీలోంచి, రగ్గు కప్పుకొని, కూర్చొని చూస్తోంది వానని— వానచినుకులని!

"ఏమే క్షేమమేనా?" గుమ్మంలోకి అడుగుపెడ్తూ అడిగాను—

"...ఆ...ఆఁ..." అని లేచి గ్లాసుతో మంచినీళ్ళు తీసుకొచ్చి, విశేషాలు అడిగింది.

వాన పెరుగుతోంది—

కొంతసేపటి తరువాత, నాతో మాట్లాడుతూనే కిటికీ చేరి, నాకేసి, వానకేసి చూస్తూ సంభాషణ కొనసాగిస్తోంది.

నేను ఏవో ప్రశ్నలు వేస్తున్నా, 'వూఁ' 'ఆఁ' అంటోందే కానీ, సరిగ్గా సమాధానం చెప్పడంలేదు, బహుశా వాన మహత్యం కాబోలు—

"ఏమిటే 'వానంటే' అప్పటికి, ఇప్పటికి ఇలాగే వున్నావా ...?" ఎలా ప్రశ్న వేయాలో తెలీలేదు ... నిముషం తరువాత—

"ఏమిటోలా శంకరం ... వాన చినుకల్లే ఖర్చులు ... పెరుగుతున్న వానలా, రోజురోజుకి 'అప్పు' పెరుగుతోంది ... వచ్చే జీతం చాలదు ... అప్పు తప్పదు ... పెద్దది పెళ్ళికొస్తోంది ... రెండోది చదువు ... మూడోవాడ్ని వచ్చే ఏడాదినుండి కాలేజి చదువుకి పట్నం పంపించాలి .. ట్యూషన్లు మునపటిలా రావడంలేదు. మధ్య మధ్యలో "పిడుగులా' ట్రాన్స్‌ఫర్ గొడవొకటి ... వానపడిన తరువాత ఏర్పడిన బురదలా వుంది జీవితం ... పెరుగుతున్న వానకి పెరుగుతున్న ఖర్చులకి..."

ఆశ్చర్యపోయాను— !

మునపటి అక్క!

ఇప్పటి అక్క!

'ఇద్దరి' అనుభూతుల్లో, భావాల్లో ఎంత తేడా?

కానీ —

అప్పుడు—

ఇప్పుడు—

వాన ఒక్కటే—

కిటికీలోంచే ఆ వానకూడా—